క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ 9, 10వ తరగతుల విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు పిన్నింటి బాలాజీరావు మంగళవారం ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తేజావత్ జయ మాట్లాడారు. స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం బాలాజీరావు మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

స్థానికంగానే పింఛన్ పంపిణీ



గీసుకొండ : మండలంలోని కొనాయమాకుల గ్రామానికి చెందిన పెన్షనర్లకు రెండు కిలోమీటర్ల దూరంలోని గీసుకొండకు వెళ్లి పింఛన్ తీసుకునే కష్టం తప్పింది. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో తహసీల్దార్ రియాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి హేమలత సహకారంతో గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో పోస్టల్ ఉద్యోగులు వృద్ధ, వికలాంగ పెన్షనర్లకు మంగళవారం పింఛన్ పంపిణీ చేశారు.

గణపతి లడ్డూ వేలం



వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలో ఛత్రపతి శివాజీ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలోని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూకు సోమవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కట్య్రాలకు చెందిన కట్ట రాజమ్మ వెంకటయ్య దంపతులు లడ్డూను రూ.17,016లకు దక్కించుకున్నారు. దంపతులను ఉత్సవ కమిటీ నిర్వాహకులు అభినందించారు.

ఫుడ్ ఫెస్టివల్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ బీఈడీ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులతో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణలో పౌష్టికాహారం కీలకమన్నారు. కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, బాలాజీ విద్యా కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రసాద్, కొండా శ్రీనివాస్, అకాడమిక్ డీన్ నారాయణ, లెక్చరర్లు శ్రీనివాస్, విజయ్ కుమార్, సూరయ్య, దామోదర్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలను తిప్పికొట్టండి'



నర్సంపేట : లంబాడా గిరిజనులపై తెల్లం వెంకట్రావు, సోయం బాబురావు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వెంకట్రావుకు, బీజేపీ నుండి కాంగ్రెస్‌లో చేరిన బాబురావుకు గుణపాఠం తప్పదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే వెంకట్రావు, బాపురావులను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రవి, చిన్న, జగన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ కమిటీలకు నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. గొల్లభామతండా కమిటీకి భానోతు బాలునాయక్, సూర్యపేటతండా కమిటీకి ధారావత్ భద్రు, గొల్లపెల్లి కమిటీకి ఈరగాని అశోక్ అధ్యక్షులుగా ఎన్నికై నట్టు ప్రకటించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరేసేలా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యాకయ్యగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు



రాయపర్తి : పీఏసీఎస్ కిటికీవద్ద టోకెన్ల కోసం గుమిగూడిన రైతులు

యూరియా కోసం రైతుల వెతలు

ఖానాపురం/నల్లబెల్లి/నెక్కొండ/రాయపర్తి/పర్వతగిరి/వర్ధన్నపేట/సంగెం/గీసుకొండ: యూరియా కోసం రైతులు రోడ్డెక్కిన దుస్థితి మంగళవారం నెలకొంది. ఖానాపురం, నల్లబెల్లి, నెక్కొండ, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, సంగెం మండలాల్లో రైతులు యూరియా కోసం బారులు తీరారు. రాయపర్తి, ఖానాపురం, గీసుకొండ మండలాల రైతులు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఖానాపురంలో వాహనాలు భారీగా నిలిచిపోగా అందులో యూరియా లారీ సైతం ఉండడంతో రైతులు లారీ ఎక్కి యూరియా తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నల్లబెల్లిలో యూరియా వస్తోందని తెలిసి రైతులు ఆదివారం తీసుకున్న టోకెన్లతో చేరుకున్నారు. యూరియా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. నెక్కొండలోని సాయి శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపునకు యూరియా వచ్చిందన్న ప్రచారంతో రైతులు భారీ సంఖ్యలో క్యూ కట్టారు. పలువురికి యూరియా పంపిణీ చేసినా సుమారు 150 మంది యూరియా దొరక్క వేదనతో ఇళ్లకు మళ్లారు. సంగెం మండలంలోని గవిచర్లలో పోలీసు బందోబస్తు నడుమ ఏఓ సాగరిక ఆధ్వర్యంలో కొందరు రైతులకు యూరియా అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించాలని అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



వర్ధన్నపేటలో..



సంగెం : గవిచర్ల రైతు వేదిక వద్ద..



నల్లబెల్లి : పీఏసీఎస్ ఎదుట వేచి ఉన్న రైతులు

'కాళేశ్వరం' అవినీతి పేరుతో కుట్ర



నర్సంపేట : చెన్నారావుపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● ధర్నా, సీఎం దిష్టిబొమ్మ దహనం

నర్సంపేట/నల్లబెల్లి/నెక్కొండ/ఖానాపురం/దుగ్గొండి/వర్ధన్నపేట/పర్వతగిరి : కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం, దుగ్గొండి, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ మాజీ సీఎం కేసీఆర్‌ను అప్రదిష్ట పాల్జేసేందుకు కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు.



ఖానాపురం : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్‌ఓసీ అందజేత

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన బస్కూరి కల్యాణి వైద్యం కోసం మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆమె భర్త రాజేందర్‌కు ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గడచిన 20 నెలల్లో మండలంలో ఒక్క కొత్త రోడ్డు పని కూడా ప్రారంభం కాలేదని గుర్తు చేశారు. రైతులకు సరిపడా యూరియా అందించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం మండలంలోని లెంకాలపల్లి శివారు అనుములోనిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి సుదర్శన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, నాయకులు ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్, నానబోయిన రాజారాం, కొత్తపల్లి అశోక్, గన్నెబోయిన చేరాలు, కక్కెర్ల శ్రీనివాస్, మేకల సాంబయ్య, పప్పు శంకర్, కస్తూరి రవీందర్, మామిండ్ల పెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా మహానేతకు వైసీపీ, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు మంగళవారం ఘన నివాళులర్పించారు. ఊరూరా దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. పట్టణాల్లో, గ్రామాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు, ప్రజలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ముఖ్యమంత్రిగా పేదలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. వైఎస్ఆర్ స్ఫూర్తిని కొనసాగిస్తామని ప్రతిన బూనారు.



నర్సంపేట : చెన్నారావుపేటలో..



నర్సంపేట : పూలమాల వేస్తున్న శాంతికుమార్



రాయపర్తి : పెర్కవేడులో..



ఖానాపురంలో..



నల్లబెల్లిలో..

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

● ఏపీఎం రవీందర్

రాయపర్తి : బాల్యవివాహాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా ఏపీఎం రవీందర్ అభివర్ణించారు. మండల కేంద్రంలోని స్వర్ణభారతి మండల సమాఖ్య భవనంలో స్నేహ సంఘం మండల స్థాయి సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో బాల్యవివాహాలు, కిశోర బాలికల సమస్యలు, సైబర్ క్రైమ్, బాల కార్మిక వ్యవస్థ, తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడారు. సామాజిక రుగ్మతల, సమస్యల పరిష్కారంలో ప్రజాచైతన్యం కీలకమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాస్, ఏఎస్సై రవీందర్, సమాఖ్య పాలక వర్గ అధ్యక్షురాలు నీరజ, కార్యదర్శి ప్రణీత, కోశాధికారి రేష్మ, సీసీలు స్వామి, యాదగిరి, సుధాకర్, సమ్మయ్య, పావని, అకౌంటెంట్ శైలజ, శారద తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్

యువతి మౌన పోరాటం



నర్సంపేట: ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ న్యాయం కోరుతూ యువతి మౌన పోరాటానికి దిగిన ఘటన చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన అబ్బదాసి ఉదయ్ ఇంటి ఎదుట గ్రామానికి చెందిన బొక్కల పల్లవి బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె మీడియా ఎదుట గోడు వెళ్ల బోసుకుంది. ఉదయ్, తను 2016 నుంచి ప్రేమించుకుంటున్నట్టు తెలిపింది. రెండు సార్లు ప్రెగ్నెన్సీ తీయించాడని చెప్పింది. పెళ్లి చేసుకోకుండా ముఖం చాటేశాడని తెలిపింది. ఈనెల 21న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో మౌన పోరాటానికి దిగినట్టు చెప్పింది. విద్యార్థి దశ నుంచే ప్రేమిస్తున్నానంటూ ఉదయ్ తన వెంట పడ్డాడని వాపోయింది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తను న్యాయం చేయాలని కోరింది.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య

సంగెం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులకు, సిబ్బందికి సూచనలు అందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అంటువ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఆశా కార్యకర్తలకు వైద్యసేవల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీకృష్ణ, పల్లె దవఖానా వైద్యులు శివకుమార్, క్రాంతి, రాకేశ్, శివ, లావణ్య, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సామాజిక సేవలే 'ఎస్ఆర్ఆర్' ధ్యేయం

● ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : తన జన్మనిచ్చిన రాయపర్తి మండల ప్రజలకు సామాజిక సేవలు అందించడమే ధ్యేయంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన షూ, టై, బెల్ట్, స్పోర్ట్స్ టీషర్ట్‌లు పంపిణీ చేశారు. అలాగే బంధనపల్లిలో వినాయక మండపాలకు రూ.2,016 చొప్పున సాయం అందించారు. అనంతరం పెర్కవేడు, సన్నూరు, మహబూబ్‌నగర్, జయరాంతండా(ఎస్), బాల్‌నాయక్ తండా, ఏకేతండా, సూర్యతండా గ్రామాల్లోని వినాయక మండపాలకు విరాళాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పేద కుటుంబాలను ఆదుకోవడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గాదె రవీందర్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, పరుపాటి రవీందర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



టై, బెల్ట్, షూ, దుస్తులు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తుది ఓటర్ల జాబితా ప్రదర్శన

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని 30 గ్రామాల్లో తుది ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అయేషా పర్వీన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శించారు. గ్రామ పంచాయతీల, మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డులపై అతికించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేందర్, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, టైపిస్ట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లికి చెందిన ముత్యాల మంకమ్మ మంగళవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు నాంపల్లి చిన్ననర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. అలాగే మాజీ వార్డు మెంబర్ అక్బర్ పక్షవాతంతో బాధపడుతుండగా పరామర్శించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న రమేశ్

● కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్

నర్సంపేట : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేశ్ తెలిపారు. మండలంలోని లింగాపురంలో లబ్ధిదారులకు సోమవారం ఆయన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే ముత్యాల సాంబయ్య, గోపతి స్వప్నలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు లబ్ది చేకూర్చేలా పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు మంజూరు చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ హామీల అమలుతోపాటు పేదల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చిక కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ పురం బాబురావు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ రాజబోయిన దూడయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



నర్సంపేట : పట్టణంలో 'పుస్తకంతో నడక' కార్యక్రమ పోస్టర్‌ను కవి, గ్రంథాలయ ఉద్యమకారుడు కాసుల రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లి గ్రంథాలయం వరకు 'పుస్తకంతో నడక' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ ఉద్యమకర్తలు, పుస్తక ప్రియులు, సాహితీవేత్తలు, గ్రంథాలయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ థింకర్స్ ఫోరం ప్రతినిధి డాక్టర్ జగదీశ్వర్, ఉపాధ్యాయుడు రఘుపతి, డాక్టర్ వెంకట్, శివ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమంగా పట్టా'



గీసుకొండ : మండలంలోని సూర్యతండాలో తమ తండ్రి అజ్మీరా రాంధన్‌కు చెందిన అసైన్డ్ భూమిని తమ సమీప బంధువులు తప్పుడు పత్రాలతో అక్రమంగా పట్టా చేయించుకున్నారని వాంకుడోతు శాంతమ్మ, ఆమె కుమారుడు రాజునాయక్, బంధువులు బానోతు సరిత, జాటోతు పూర్ణమ్మ, బోడ నీలమ్మ, గుగులోతు నర్సమ్మ, జాటోతు రవీందర్, శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కొనాయమాకుల గ్రామం లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. సమీపంలోని ఇతర భూముల సర్వే నెంబర్లతో తమకు చెందిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అక్రమంగా పట్టా చేసుకున్న సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుని తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు.

కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు

సంగెం/నెక్కొండ : సంగెం, నెక్కొండ మండలాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాడు భక్తులు మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. నెక్కొండలో యువత యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, ఎస్సై మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, నాయకులు చల్లా శ్రీపాల్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీరంగం సంపత్, సభ్యుడు గంధం సుధాకర్, మేర్గు విజయ్, మోడెం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ డే వేడుక



మాన్‌సూన్ డే వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సంపేట : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, అక్షర స్కూళ్లలో మంగళవారం మాన్‌సూన్ డే వేడుక నిర్వహించారు. విద్యార్థులు రెయిన్ కోట్స్, గొడుగులతో చిరుజల్లులతో కూడిన వర్షాన్ని ఆటపాటలతో ఆస్వాదించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ వనజ, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.